


# అల్లాకె నామ్ పొ ఖైరాత్ కర్

## దేవుడి పేరున దానం చెయ్యి

ఒక ఊళ్లో ఒక అవ్వా మనవడూ ఉన్నారు. మనవడు పొద్దుననంగా పోయి కష్టం చేసి సాయంత్రానికి సంపాదిచ్చిందంతా తెచ్చి అవ్వ చేతిలో పోస్తాడు. ఆ సంపాదనలో నుంచి అవ్వ వాళ్లిద్దరికీ అవసరమైనంత మాత్రమే వాడుకొని తక్కినదంతా అల్లా పేరున ఖైరాత్ (దానం) చేసేది.

యిలాగే రోజులు గడుస్తా ఉన్నాయి. ఒకసారి మనవడికి జ్వరం వచ్చింది. నాలుగైదు రోజులదాకా పనికి పోయే వీలులేదు.

'అవా అవా. నాకు జ్వరం వచ్చింది గదా. నువు దాచిపెట్టిన డబ్బుల్ని బయటకు తియ్యి వాడుకుందాం' అన్నాడు మనవడు.

'ఏం డబ్బులు బేటా? నా దగ్గర యాడివి? నువ్వు సంపాదించింది తెస్తావు. అందులో మనకు అవసరం లేనిది నేను అల్లా పేరున ఏరోజుకారోజు దానం చేసేస్తాను. దానం చేయమని దేవుడు చెప్పాడు కదా. ఆ సొమ్ము ఎక్కడికీ పోదులే' అంది అవ్వ.


మనవడికి చాలా కోపం వచ్చేసింది. 'కష్టపడి సంపాదిచ్చిందంతా ఊరోళ్లకి దానం చేయమని ఏ అల్లా చెప్పాడు. అసలు అట్టాంటి అల్లా ఎలా అల్లా అవుతాడు. నేను అల్లాని అడిగొస్తానుండు' అని మూటాముల్లె సర్దుకొని అల్లా కోసం అడవిలోకి బయలుదేరాడు.

అడవిలో కొంచెం దూరం పోయాక వాడికి ఆకలేసింది. దప్పిక కలిగింది. దూరంగా ఒక మామిడి చెట్టు, ఒక నీళ్ల బావి కనిపించాయి. మామిడి చెట్టుకి పండ్లు విరగగాసున్నాయి. నీళ్ల బావిలో నీళ్లు నిండుగా తొణికిసలాడుతున్నాయి. పోయి గబగబా నాలుగు మామిడిపండ్లు కోసుకొని నోట్లో పెట్టుకున్నాడు. చేదూ చేదూ చేదంటే చేదుగా వున్నాయవి. ఎన్ని కోసినా చేదే. సరే నీళ్లన్నా తాగుదామని బావిలోకి దిగితే అవి కూడా చేదు. ఒక్క గుక్క కూడా గొంతు దిగలేదు.

'ఏమిరా ఈ మాయ' అని అనుకుంటా వుంటే మామిడి చెట్టుకీ, బావికీ మాటలు వచ్చి 'నాయనా, నువ్వెవరు? ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాయి.

'నేను ఫలానా ఊరి అబ్బాయిని. అల్లాని చూడ్డానికి వెళుతున్నాను. దానం చేయమని ఎందుకు చెప్పాడో కనుక్కుందామని వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'నాయనా. నీ ముక్కతోపాటు మా ముక్క కూడా కనుక్కో. ఈ దారిన యింతమంది పోతుంటారుగానీ ఒక్కరు కూడా ఈ మామిడి పండ్లు తినరు. ఒక్కరు కూడా ఈ మంచినీళ్లు తాగరు. అందరికీ అంత చేదైపోయాము మేము. మాకెందుకీ శాపమో కనుక్కో' అని అడిగాయి మామిడిచెట్టు, నీళ్ల బావి.



'అలాగే' అని బయలుదేరాడు మనవడు.

కాస్త దూరం వెళ్లాక ఒక పన్నెండడుగుల పాము నడుములు విరిగిపోయినట్టుగా కదల్లేక మెదల్లేక పడుకొని కనిపించింది. దారిన పోతున్న మనవడిని చూసి 'నాయనా. ఎవరు నువ్వు? ఎక్కడికి పోతున్నావు?' అని అడిగింది.

'నేను అల్లాని చూడ్డానికి వెళుతున్నాను. ఖైరాత్ అంటే అర్థం ఏమిటో కనుక్కుందామని వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'బేటా. నీ ముక్కతోపాటు నా ముక్క కూడా కనుక్కో. ఎన్నో ఏళ్లుగా నేను కదల్లేక మెదల్లేక పడుకొని వున్నాను. ఎందుకో నా తల చాలా భారంగా వుంటోంది. దీనికి కారణం ఏమిటో కనుక్కో' అంది పాము.

'అలాగే' అని బయలుదేరాడు మనవడు.

యింకాస్త దూరం వెళ్లాక ఒక ఊరు వచ్చింది. ఆ ఊర్లోని జనం విచారంగా వున్నారు. ఆ ఊరి నవాబు కూడా విచారంగా వున్నాడు.

ఆ నవాబు ఈ మనవడి సంగతి విని 'బాబూ. నీ ముక్కతోపాటు నా ముక్క కూడా కనుక్కో. మా ఊర్లో మేమొక మసీదు కడుతున్నాము. దానికి పగలు పొద్దస్తం మినార్లు కడతాము. కాని సాయంత్రమయ్యేసరికి అవి కూలిపోతున్నాయి. ఈ మాయ ఏమిటో కనుక్కో' అన్నాడు.

కాస్త దూరం పోయాక మనవడికి ఒక ఫకీర్ కనిపించాడు. 'ఎక్కడికి బాబు. ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాడు.

'నేను అల్లాని చూడడానికి వెళుతున్నాను. నా సందేహాలు తీర్చుకోవడానికి వెళుతున్నాను' అన్నాడు మనవడు.

'యీమాత్రం దానికి అల్లాదాకా ఎందుకులే నాయనా. నేను తీర్చగలనేమో చూస్తా' అన్నాడు ఫకీరు.

'సరే అయితే. ఫలానా చోట ఫలానా మామిడిచెట్టు ఉంది. దాని మామిడికాయలు చేదంటే చేదుగా వున్నాయి. అక్కడే ఒక మంచినీళ్ల బావి వుంది. దాని నీళ్లు కూడా చేదుగా వున్నాయి. దానికి కారణం ఏంది?' అని అడిగాడు మనవడు.

'బాబూ. ఆ మామిడిచెట్టు పూర్వజన్మలో ఖైరాత్ చేయలేదు. అలా చేయకపోవడం వల్ల దాని దగ్గర డబ్బులు పేరుకుపోయాయి. పేరుకుపోయిన డబ్బుని పేదవాళ్లకు అప్పు యివ్వాలనిపించింది. అప్పు ప్రస్తావన వచ్చేసరికి వడ్డీ తినాలనిపించింది. మన ఇస్లాంలో వడ్డీ ఎంత హరామో (నిషిద్ధమో) నీకు తెలుసుగదా. వడ్డీ తిన్నోళ్ల బతుకు అంతే. అందుకని ఈ జన్మలో ఎవరూ దాని ముఖం చూడటం లేదు. యింక ఆ నీళ్ల బావి సంగతి. అది పూర్వ జన్మలో ఒకరికి ఒక సాయం చేయకుండా, ఒకరికి కనీసం ఒక లోటా మంచినీళ్లు కూడా యివ్వకుండా బతికింది. అందుకని ఈ జన్మలో దాని నీళ్లు ఎవ్వరూ ముట్టడం లేదు' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుకు మనవడు చాలా తృప్తిపడ్డాడు.

'ఫలానా చోట ఒక పన్నెండడుగుల పాము ఉంది. చాన్నాళ్లుగా దాని తల భారమైపోయి కదల్లేక పోతోంది. దాని సంగతేంది?' అని అడిగాడు.

'దాని తల మీద ఒక మణి ఉంది. ఆ మణి కింద పెద్ద ఖజానా ఉంది. ఆ ఖజానాని దించితే దాని తలభారం తీరిపోతుంది. నీ కష్టార్జితం నుంచి మీ అవ్వ బీదవాళ్లకి రోజూ ఖైరాత్ చేసేదిగదా. దానికి ఫలితంగా అంతపెద్ద ఖజానా ఆ పాము పడగ మీద నీ పేరున ఉంది. వెళ్లి తీసుకో. అది నీదే' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుకు కూడా మనవడు చాలా తృప్తి పడ్డాడు.

'ఫలానా ఊర్లో ఫలానా నవాబుగారు మసీదును కడుతున్నారు. పగలు కట్టిన మినార్లు సాయంత్రానికి కూలిపోతున్నాయి. దీనికి కారణమేమి?' అని అడిగాడు.

'బాబూ. ఎవరైనా సరే ముందు యింటి సంగతి చూసుకొని తర్వాత లోకం సంగతి చూసుకోవాలి. ఆ నవాబుగారికి పన్నెండేళ్ల కూతురుంది. ఈడొచ్చిన ఆ పిల్లకి పెళ్లి సంగతి ఆలోచించకుండా ఆ నవాబు మసీదులూ మీనార్లు అని తిరుగుతున్నాడు. ఆ పిల్ల సందేళ అయ్యేసరికి మేడ మీదకొచ్చి ఒక్క నిట్టూర్పు విడుస్తా ఉంది. ఆ దెబ్బకు ఆ మినార్లు పడిపోతున్నాయి. పెళ్లీడు వచ్చిన పిల్లకు కల్యాణం జరిపిస్తే వచ్చే పుణ్యం పది మసీదులు కట్టినా రాదు' అన్నాడు ఫకీరు.

ఆ జవాబుతో తృప్తిపొందిన మనవడు ఆ ఫకీరుకి సలాములు చెప్పి నేరుగా నవాబు దగ్గరకు వెళ్లాడు. సంగతి చెప్పాడు. 'నాయనా. నా కూతురికి నీకంటే యోగ్యుడెవరు?' అని తన కూతుర్ని యిచ్చి ధూంధాంగా నిఖా జరిపించాడు నవాబు. ఆ తర్వాత మనవడు నేరుగా పాము దగ్గరకు వెళ్లి సంగతి చెప్పాడు.

'బతికించావు తండ్రీ. ముందు ఆ మణీ, ఖజానా తీసుకొని నా నెత్తిబరువు దించు' అంది పాము. మనవడు ఆ మణినీ, అంతులేని ఖజానానీ తీసుకున్నాడు.

ఆ తర్వాత మామిడి చెట్టు, నీళ్ల బావి దగ్గరకు వెళ్లాడు. 'పూర్వజన్మలో మీరు చేసిన పాపాలు ఈ జన్మలో మిమ్మల్ని పట్టి పల్లారుస్తా ఉన్నాయి. యింక మీ బతుకు యింతే. అనుభవించండి' అని చెప్పాడు.

చివరికి సొంతూరికి పోయి, అవ్వని కలిసి 'అవా. నువ్వు చెప్పింది సత్యం. దేవుడి పేరున దానం చెయ్యాలి. ఆ సొమ్ము ఎక్కడికీ పోదు' అని వాటేసుకున్నాడు.